

కనికరించరా..?



● ఏనుగులు, మనుషుల మధ్య పెరిగిన సంఘర్షణ ● ఏనుగుల ప్రాణాలు తీస్తున్న కాఫీతోటల విద్యుత్ కంచెలు, రోడ్డు ప్రమాదాలు, వేటగాళ్ల తుపాకులు

● ఐదేళ్లలో పలు ప్రమాదాల్లో అసువులు బాసిన 372 గజరాజులు ● దేశంలోనే అత్యధిక ఏనుగులు రాష్ట్రంలోనే.. ● కాపాడుకోవాలంటున్న వన్యప్రాణి ప్రేమికులు

బెంగళూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆసియాఖండంలోనే అత్యధిక ఏనుగులు భారత్‌లోనే ఉండడం గర్వకారణం. అందులోనూ దేశవ్యాప్తంగా అత్యధికంగా ఏనుగులు కలిగిన రాష్ట్రాల్లో కర్ణాటక మొదటి స్థానంలో ఉండడం విశేషం.. అయితే ఏటా అకాలంగా మృత్యువాత పడుతున్న ఏనుగుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అధికారిక గణాంకాల ప్రకారం ఐదేళ్ల వ్యవధిలో 372 ఏనుగులు మృతి చెందాయి. ఇందులో 67 ఏనుగులు అసహజంగా అసువులు బాశాయి. రాష్ట్రంలో పశ్చిమకనుమలతోపాటు విస్తారమైన అటవీప్రాంతం ఉంది. అందుకు అనుగుణంగానే పలు అటవీప్రాంతాల్లో ఏనుగుల జీవనానికి అనుకూలం ఉంది. దీంతో దేశంలోనే ఎక్కువ ఏనుగులు రాష్ట్రంలో ఉన్నాయి. ఉత్తరకర్ణాటక జిల్లాను మినహాయిస్తే తీరప్రాంత, మైసూరు, బెంగళూరు పరిసర జిల్లాల్లో ఏనుగుల నివాసానికి అనుకూలమైన అటవీప్రాంతాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 6,395 ఏనుగులు ఉన్నాయి. ఇటీవల ఏనుగులు అత్యధికంగా ఉన్నాయనే సంతోషంతోపాటు ఏనుగులు, మానవ సంఘర్షణలు అధికమవుతున్నాయి. అటవీప్రాంతాలకు సమీపంలోని పంట పొలాలపై దాడులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. హాసన్, కొడగు, మైసూరు, చామరాజనగర, మండ్య, బెంగళూరు గ్రామీణ, కనకపుర ప్రాంతాలలో ఏనుగులు, మానవసంఘర్షణలు పెరిగాయి. హాసన్ జిల్లా సకలేశపుర, ఆలూరు తాలూకాల పరిధిలో నిరంతరంగా దాడులు కొనసాగుతున్నాయి. 2020-21లో 74 ఏనుగులు, ఇందులో 16 అసహజంగాను, 2021-22లో 89 ఏనుగులు, వీటిలో 16 అసహజంగా మృతి చెందాయి. 2022-23లో 74 ఏనుగులు, వీటిలో 16 అసహజ మృత్యువాత చెందాయి. 2023-24లో 101 ఏనుగులు, వీటిలో అసహజంగా 14 మృతి చెందాయి. 2024-25లో 30 వీటిలో 5 అసహజంగా మృతి చెందాయి.

విద్యుదాఘాతంతో కన్ను మూసిన అంబారీని మోసిన అశ్వత్థామ

రెండుసార్లు మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొని అంబారీ మోసే ఏనుగుగా గుర్తింపు పొందిన 38ఏళ్ల అశ్వత్థామ నాగరహొళె పులుల సంరక్షణ ప్రాంతంలో విద్యుదాఘాతంతో మృతిచెందింది. మడికేరి, హాసన్, సకలేశపుర, చిక్కమగళూరు ప్రాంతాల్లో కాఫీ తోటలు విస్తారంగా ఉన్నాయి. పంటలను కాపాడుకునేందుకు ఇక్కడి రైతులు, కూలీలు సంరక్షణకోసం కంచెకు విద్యుత్‌తోపాటు స్వీయరక్షణకోసం లైసెన్స్ తుపాకీలు వాడుతుంటారు. పలు చోట్ల కాల్పుల్లోనూ ఏనుగులు మృతి చెందాయి. ఏనుగులు కాఫీ, అరటి, వక్క, మిరియాలతోపాటు ఇతరత్రా తోటలు, పంటలను నాశనం చేస్తాయని రైతులు తుపాకులు ఉపయోగిస్తుంటారు. కొందరు సీసంతో ఉన్న గుండ్లతో షూట్ చేస్తుంటారు. అవి ఏనుగుల శరీరంపై పడితే ఇతరప్రాంతాలకు వెళ్తాయి. అయితే తలభాగంలో పడితే నిర్వీర్యంగా మారి మృత్యువాత చెందుతాయి.



అంబారీకి శిక్షణ పొందుతున్న గజరాజు (ఫైల్)

అవగాహన కల్పిస్తున్న 'ఎలిఫెండ్' ఫౌండేషన్

ఏనుగుల పట్ల ప్రజలలో చైతన్య తీసుకొచ్చేందుకు అంతర్జాతీయ ఎలిఫెండ్ ఫౌండేషన్, వన్యజీవి సంస్థ 2012 ఆగస్టు 12నుంచి ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని జరుపుతోంది. 2016 నుంచి దేశంలోనూ అటువంటి కార్యక్రమం కొనసాగిస్తున్నారు. 1879లో ఏనుగుల సంరక్షణకు ఓ నిబంధన అమలు చేశారు. ఆ తర్వాత ఏనుగులపై కాల్పులు, విద్యుత్ షాక్ వంటివాటికి చట్టపరంగా చర్యలు తీసుకోదలిచారు. కాగా సక్రెబైలు శిబిరంలో రెండు ఏనుగులకు తుంగా, చాముండి అని పేరు పెట్టారు.

మానవ తప్పిదాలకు బలైన ఏనుగులు

● ఇదే ఏడాది మే నెలలో సకలేశపుర తాలూకా సుళ్ళక్కి, శాంతపుర గ్రామాల వద్ద ఓ కుంకీ ఏనుగు ఒకటి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది.

● ఇటీవల గుండ్లుపేట ప్రాంతం కురబరహుండి గ్రామంలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది.

● గత ఏడాది విరాజ్‌పేట తాలూకా కణ్ణంగాల చెరువులో పడి 18ఏళ్ల మగ ఏనుగు మృతి చెందింది.

● గోణికొప్ప ప్రాంతం అర్వతొట్లు గ్రామంలో 13ఏళ్ల ఏనుగు విద్యుత్‌తీగలు తగిలి మృతి చెందింది. సొంటికొప్పలులోనూ ఓ ఏనుగు మృతి చెందింది.

● ఆహారం కోసం కొడగు జిల్లా పరిధిలోని కుశాలనగర తాలూకా ఎస్టేట్‌కు వచ్చినవేళ గర్భంతో ఉన్న ఏనుగు తుపాకీ కాల్పులకు బలైంది. ఈ సంఘటనలన్నీ మానవ, వన్యజీవుల మధ్య సంఘర్షణ తీవ్రమైనందునే ఏనుగుల మృతి కారణమవుతోంది. అటవీశాఖ ఏనుగులను గ్రామాలవైపు రాకుండా అరికట్టాల్సిన అవసరం ఉంది. అందుకు ప్రత్యామ్నాయమైన పనులు కొనసాగించాల్సి ఉంది.

దక్షిణ భారత్‌లోనే ఏనుగులు అధికం

దేశంలో 27,312కుపైగా ఏనుగులు ఉన్నాయి. దక్షిణభారత్‌లో కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోనే ఏనుగులు అత్యధికంగా ఉన్నాయి. 3 రాష్ట్రాలలో 12,210 ఏనుగులు ఉండగా కర్ణాటకలో 6,395 ఏనుగులు ఉన్నాయి. ఈశాన్యభారత్ అస్సోంలో 5,719, దక్షిణంలోని కేరళలో 3054, తమిళనాడులో 2,761 ఏనుగులు, ఒడిశాలో 1966 ఏనుగులు ఉన్నాయి. కాగా రాష్ట్రంలోని బండిపుర అభయారణ్యంలో 1,116 ఏనుగులు ఉండగా, నాగరహొళె పులుల సంరక్షణా ప్రదేశంలో 831, మలెమహదేశ్వర అభయారణ్యంలో 706, బిళగిరి రంగనబెట్టలో 619 ఏనుగులు, కావేరి వన్యధామలో 236, మడికేరిలో 214, మడికేరి వైల్డ్‌లైఫ్‌లో 113, మైసూరు విభాగంలో 59, విరాజ్‌పేట విభాగంలో 58 ఏనుగులు ఉన్నాయి. ఎల్లాపుర విభాగంలో కేవలం రెండు ఏనుగులు మాత్రమే ఉన్నాయి.



శిక్షణ పొందుతున్న ఏనుగులు

ఎలిఫెంట్ కారిడార్ ఎందుకు..?

ఏనుగుల కారిడార్ ఉండడం ద్వారా ఒక ప్రదేశం నుంచి మరో ప్రాంతానికి సులభంగా వెళ్లేందుకు వీలు కానుంది. ఎలిఫెంట్ కారిడార్ ద్వారా ప్రమాదాలు, ఇతర వన్యప్రాణులనుంచి సంఘర్షణ, మృతి చెందకుండా ఉండేందుకు అడ్డుకట్ట వేయవచ్చు. ఏనుగుల సంచారానికి వీలు కల్పించినట్లు అవుతుంది. అటవీప్రాంతాల్లో వెదురుతోపాటు ఇతరత్రా ఆహారం, సమగ్రంగా లభించేలా ఏర్పాట్లు చేయాలి. లేనిపక్షంలో పంటపొలాలపై దాడులు జరుగుతాయి. ఏనుగుల కారిడార్‌లో ఆక్రమణలను తొలగించాలి. అటవీ పరిసర ప్రాంతాలలోని పొలాలను కొనుగోలు చేసి కారిడార్‌లకు అనుసంధానం చేయాలి. ఏనుగుల అభయారణ్యాలు ఉండే చోట గనుల తవ్వకాలను నిషేధించాలి. కొత్తగా ఎటువంటి ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వరాదు. ఏనుగుల సంఘర్షణను అడ్డుకునేందుకు కందకాలు నిర్మించడం, సౌరశక్తితో కంచె ఏర్పాటు, ఆహారకొరత నియంత్రించేందుకు అటవీప్రాంతాలలో వెదురు ఇతరత్రా పైర్లను సాగుచేయడం, చెరువులు, కుంటలలో తగినంత నీరు నిల్వ ఉండేలా చేయాల్సి ఉంటుంది. ఏనుగులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జంతు ప్రేమికులు పిలుపునిస్తున్నారు.



విధానసౌధ ముందు సీఎం సిద్దరామయ్య, సభాపతి బసవరాజ హొరట్టి, పలు రాష్ట్రాల స్పీకర్లు

చట్టసభల్లో నిర్ణయాలే కీలకం

● అవే సామాజిక ప్రగతిని నిర్ణయిస్తాయి: సభాపతి బసవరాజ హొరట్టి

● 11వ సీపీఏ సమ్మేళనం ఘనంగా ప్రారంభం ● హాజరైన పలు రాష్ట్రాల స్పీకర్లు

బెంగళూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మారుతున్న సాంకేతికత కారణంగా చట్టసభల నిర్వహణలోనూ అభివృద్ధి సాధ్యమవుతోందని, సామాజిక పురోగతికి చట్టసభల్లో తీసుకునే నిర్ణయాలే కీలకమని విధాన పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి అభిప్రాయపడ్డారు. 11వ కామన్వెల్త్ పార్లమెంట్ అసోసియేషన్ (సీపీఏ) సమావేశం నగరంలో గురువారం ప్రారంభమైంది. సమ్మేళనానికి గౌరవాన్విత అధ్యక్షుడిగా బసవరాజహొరట్టి పాల్గొని ప్రసంగించారు. ప్రజల సామాజిక, రాజకీయ, ఆర్థికత స్థిరంగా ఉండేందుకు చట్టసభల పాత్ర కీలకమన్నారు. తద్వారా చట్టసభలలో ప్రజాప్రతినిధుల పాత్ర ముఖ్యమనేది గుర్తించాలని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగబద్ధంగా సామాజిక పురోగతికి చట్టసభలు తగిన నిర్ణయాలు తీసుకునేలా వ్యవహరించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. కీలక అంశాలలో సభ్యులు సమగ్రమైన చర్చలు జరిపి మార్గదర్శకం చేయాలన్నారు. చట్టపరిధిలో రాష్ట్ర, దేశాభివృద్ధిలో బాధ్యతలను గుర్తించి ప్రజాప్రతినిధులు కొనసాగాల్సి ఉందన్నారు.

వరుసగా ఎనిమిదిసార్లు ఒకే నియోజకవర్గం నుంచి 45 ఏళ్లుగా పరిషత్ సభ్యుడిగా కొనసాగుతుండడంతో జూన 30నాటికి లిమ్కాబుక్ ఆఫ్ రికార్డు 2024, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కిందని ఇందుకు ప్రజల (మిగతా 7వ పేజీలో)

భూ పరిహారంపై 16న తుది నిర్ణయం

● కువెంపునకు భారతరత్న ఇవ్వాలని సిఫారసు ● విష్ణువర్ధన్, సరోజాదేవికి కర్ణాటక రత్న ● కేబినెట్ తీర్మానం

బెంగళూరు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): కృష్ణా ఎగువప్రాజెక్టు మూడో దశ పనులకు అవసరమైన భూస్వాధీనానికి అవసరమైన పరిహారం ఇవ్వడానికి, భూస్వాధీన ప్రక్రియకు రాష్ట్రప్రభుత్వం ఈనెల 16న అంతిమ నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర న్యాయ, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ వెల్లడించారు. గురువారం మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈనెల 16న ప్రత్యేక మంత్రివర్గ భేటీ ఉంటుందన్నారు. ప్రస్తుత కేబినెట్ సమావేశంలో కృష్ణా ఎగువ ప్రాజెక్టు మూడోదశకు భూస్వాధీన ప్రక్రియకు ఒకేవిడతలో చర్యలు చేపట్టేలా ఏకరూపధర నిర్ణయించే అంశం, ఒప్పందంపై విస్తృతమైన చర్చలు జరిగాయన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై అధ్యయనం

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత, ఇతర అంశాలపై మంత్రివర్గ ఉపసమితి నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలోని వివిధశాఖలు, బోర్డులలో అవుట్‌సోర్సింగ్‌పై ఉద్యోగులు ఉన్నారని వారి సాధకబాధకాలపై అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసమితిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో అవుట్‌సోర్సింగ్ నియామకాలు చేపట్టే అంశంపై మంత్రివర్గ ఉపసమితి తగిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. మంత్రివర్గ ఉపసమితి చేసే సిఫారసుల ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.



కవి కువెంపు



విష్ణువర్ధన్



సరోజాదేవి

రాష్ట్ర కవి కువెంపునకు భారతరత్న ఇవ్వాలి

'రాష్ట్రకవి' (జాతీయకవి)గా పేరొందిన కువెంపు (కుప్పళ్ళి వెంకటప్ప పుట్టప్ప)కు భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి సిఫారసు చేయదలిచారు. అలాగే నటులు డాక్టర్ విష్ణువర్ధన్‌కు, సరోజాదేవిలకు కర్ణాటక రత్న ఇచ్చే లా మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. ఇదే సందర్భంగా వివిధశాఖల అంశాలపై చర్చలు జరిగాయన్నారు.

నిశ్చితార్థం జంట రోడ్డు ప్రమాదంలో దుర్మరణం

బెంగళూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవలే నిశ్చితార్థం జరిగిన జంట రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందారు. శివమొగ్గ జిల్లా శిఖారిపుర తాలూకా పరిధిలో అంబారకొప్ప క్రాస్ వద్ద బైక్‌లో వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఎకోవాహనం ఢీకొంది. బైక్ మీద వస్తున్న బసనగౌడ(24), రేఖా(22) అక్కడికక్కడే మృతి చెందారు. వీరికి ఆగస్టులో నిశ్చితార్థం జరిగింది. మత్తికోట గ్రామానికి చెందిన బసనగౌడ సొరబ తాలూకా గంగొళ్ళి గ్రామానికి చెందిన కాబోయే భార్య ఇంటికి మంగళవారం వచ్చారు. ఇద్దరూ కలిసి సమీపంలోని ఓ ఆలయానికి బుధవారం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సంఘటనతో ఇరుగ్రామాలకు చెందిన కుటుంబ సభ్యులు, బంధువుల్లో విషాదం నెలకొంది.



బసవనగౌడ, రేఖ (ఫైల్)

కలబురగి జిల్లాలో కంపించిన భూమి

బెంగళూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కలబురగి జిల్లా ఆళంద తాలూకా పరిధిలో గురువారం ఉదయం 8.17 గంటల సమయంలో పలుచోట్ల భూమి కంపించింది. భూకంప తీవ్రత రెక్టర్ స్కేల్‌పై తీవ్రత 2.3గా నమోదైంది. ఆలూరు గ్రామ పంచాయతీ జవళగా గ్రామానికి ఆగ్నేయంగా అర కిలోమీటరు దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. జవళగాతో పాటు ఈ గ్రామం నుంచి 2.4 కి.మీ. దూరంలోని సిరిచంద గ్రామ పంచాయతీ చించనసూరులోనూ భూమి కంపించింది. భూమి కంపించిన సమయంలో పలు రకాల శబ్దాలు వచ్చాయని స్థానికులు తెలిపారు. కాగా, ఈ భూకంపం గురించి ప్రజలు భయపడాల్సిన పనిలేదని రాష్ట్ర వాతావరణ పరిశోధన శాఖ తెలిపింది. ప్రజలు ఆందోళన చెందవద్దని, ఏమీ కాదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రియాంక ఖర్గే అన్నారు.

ఉప్పొంగిన వాగులు.. వంకలు

● బళ్లారి జిల్లాలో భారీ వర్షాలు 9



శాంతినగర్ వద్ద ఉగ్రరూపం దాల్చిన నారహళ్లి వాగు

సాంకేతిక విద్యలో నైపుణ్యతే ప్రధానం

● రేవా యూనివర్సిటీ అకడమిక్ కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఒరాకిల్ గ్లోబల్ సర్వీసెస్ ఉపాధ్యక్షులు సత్యలంకా

బెంగళూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో నైపుణ్యత సాధించడమే ముఖ్యమని తద్వారా ఉన్నత ఉద్యోగాలు, పరిశోధనలకు అనుకూలం కానుందని ఒరాకల్ గ్లోబల్ సర్వీసెస్ ఉపాధ్యక్షులు సత్యలంకా అభిప్రాయపడ్డారు. రేవా యూనివర్సిటీలో బుధవారం ఇంజనీరింగ్‌తోపాటు అన్ని కోర్సుల అకడమిక్ కార్యక్రమాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ పి. శ్యామరాజు అధ్యక్షత వహించారు. ఇదే సందర్భంగా విద్యార్థులనుద్దేశించి సత్యలంకా మాట్లాడుతూ ఇంజనీరింగ్ నాలుగేళ్ళలో విద్యార్థుల జ్ఞానాన్ని పొందడమే కాకుండా జీవితకాలం ఉండే స్నేహితులను పొందుతారన్నారు. మిత్రులతో నైతిక విలువలను పెంపొందింప చేసుకుంటారన్నారు. బృందాలుగా రూపొందించే ప్రయోగాలు 90 శాతం చికిత్స అందించేలాంటి శక్తిని ఇస్తాయన్నారు. విమర్శలు, సరికొత్త ఆలోచన విద్యార్థులలో కలిగిస్తాయన్నారు. ట్రీసా మోటార్స్ ఫౌండర్ రోహన్ శ్రావణ్ మాట్లాడుతూ ఐఐటీ ఖరగ్‌పురలో ప్రారంభపు రోజులను స్మరించుకుని పారిశ్రామిక వేత్తగా ఏదిగేందుకు దారితీసిన ప్రయాణాన్ని పంచుకున్నారు. విద్యార్థులు కుతూహలాన్ని పెంచుకునేందుక ప్రశ్నలు వేసే విషయంలో ఎప్పటికీ వెనుకాడరాదన్నారు. జాప్యానికి అవకాశం లేకుండా కలలను సాకారం చేసుకోవాలన్నారు. సరళమైన ప్రశ్నలను అడిగే విధానంలో మీరు ముందుంటే ఇప్పటికే సహచరులకంటే ముందంజలో ఉన్నట్లే అన్నారు. రేపటికోసం ఆలోచించకుండా అనుకున్న రోజే కలలు కనండి వాటిని అమలు చేసేందుకు సన్నద్ధులు కండి అంటూ పిలుపునిచ్చారు. విఫలమనేది ఎప్పటికీ వృథా కాదని అది భవిష్యత్ ప్రగతికి మార్గదర్శకమంటూ విద్యార్థులను ఉత్తేజపరిచేలా మాట్లాడారు. చాన్సలర్ డాక్టర్ పి శ్యామరాజు మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చేలాంటి విధానాలే మా సంస్థ ఆశయమన్నారు. గుణాత్మక విద్య, నైపుణ్యత వ్యక్తిగత అభివృద్ధి పర్యావరణ వ్యవస్థను సమగ్రంగా ప్రగతివైపు తీసుకెళుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు వ్యవస్థలో సమిష్టి అవగాహనతో ఉన్నారన్నారు పారిశ్రామిక వ్యవస్థకు అవసరమైన మానవవనరులు కల్పించేందుకు శాయశక్తులా రేవా పనిచేస్తోందన్నారు. రేవా లక్ష్యం ఎడ్యుకేట్ టు ఎంటర్‌ప్రైస్ అనేది కేవలం ప్రకటన కాదని ఆచరణలో సాధ్యం చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి డిగ్రీతో పాటు ఉద్యోగి కావాలని భావిస్తున్నట్లు తెలిపారు. జాతీయ నిర్మాణానికి యువ శక్తి ద్వారా ఆత్మనిర్భర భారత దృష్టికోనంతో పారిశ్రామిక మనోభావాలు నింపుతున్నట్లు తెలిపారు. కొత్త బ్యాచ్‌లో చేరిన విద్యార్థులను సాదరంగా ఆహ్వానం పలికారు. వైస్‌ఛాన్సులర్ డాక్టర్ సంజయ్ ఆర్ చెట్టీస్, ప్రొవైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్‌సీ బిరాదార్, రిజిస్ట్రార్ డాక్టర్ కేఎస్ నారాయణస్వామి, మౌల్యమాపన విభాగం రిజిస్ట్రార్ డాక్టర్ బీనాతో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రేవాలో అకడమిక్ ప్రారంభోత్సవంలో చాన్సలర్ పి. శ్యామరాజు తదితరులు

హోసూరులో అంతర్జాతీయ విమానాశ్రయం

● పెట్టుబడిదారుల సదస్సులో సీఎం



సంస్థ ప్రతినిధులతో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కృష్ణగిరి జిల్లా హోసూరు వద్ద 2వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం నెలకొల్పనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. హోసూరులో గురువారం ఉదయం జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గతంలో హోసూరు చిన్న వాణిజ్యనగరంగా ఉండేదని, ప్రస్తుతం ఈ నగరంలో ఫ్యాక్టరీలు ప్రారంభించేందుకు దేశవిదేశాల నుండి పారిశ్రామికవేత్తలు వస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలోనే 5లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో ఐటీ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్టాలిన్ అంటేనే 'మేన్ ఆఫ్ స్టీల్' అనేలా తాను తీసుకునే నిర్ణయాలన్నీ దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించే విధంగానే ఉంటాయని, అంతే కాకుండా కార్యసాధనలో తనకు కాస్త పట్టుదల ఎక్కువేనని పేర్కొన్నారు. ఇటీవల జర్మనీ, ఇంగ్లండ్ దేశాల్లో పర్యటించి రూ.15,516 కోట్ల మేర విదేశీ పెట్టుబడులను సమీకరించగలిగానని, ఆ సంతోషంతోనే హోసూరులో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సదస్సులో రూ.26వేల కోట్లకు (మిగతా 7వ పేజీలో)

వైసీపీ కోతలు.. కూటమిపైనే ఆశలు..

- కలగానే పీఆర్సీ ఏర్పాటు
- అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పెంపుపై అదే నిర్లిప్తత
- గత ప్రభుత్వంలో కోతలతో తీవ్ర నష్టం



పరిష్కారంకాని పెన్షనర్ల సమస్యలు.. అందని డీఆర్ అరియర్స్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల పాటు ప్రభుత్వ ఉద్యోగాలు చేసి రిటైరైన పెన్షనర్లను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం వారిపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. అప్పటి వరకు అందుతున్న ప్రయోజనాల్లో కోతలు పెట్టింది. ఆర్థిక ప్రయోజనాలను పూర్తిగా ఆపేసింది. దీంతో ఐదేళ్లు పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారు. డీఆర్ అరియర్స్ పెండింగ్‌లో ఉంచడంతోపాటు... పీఆర్సీ కమిషన్ ఏర్పాటు ఊసే ఎత్తకపోవడంతో ఆర్థికంగా చితికిపోయారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అందించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పర్సెంటేజీలను వైసీపీ పాలకులు తగ్గించి మరింత ఆర్థికంగా కుంగదీశారు. ఈహెచ్ఎస్ పరిధిలోని మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను అందించకుండా ఇబ్బందులపాలు చేశారు. పెన్షనర్లు చనిపోతే తక్షణ దహన సంస్కారాల కింద అందించే రూ.25 వేలను పలువురు పెన్షనర్ల కుటుంబాలు కోల్పోవాల్సి వచ్చింది. ఇన్ని సమస్యల నడుమ నెట్టుకొచ్చిన పెన్షనర్లు కూటమి ప్రభుత్వంలోనూ వాటిని ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి, ఆదుకోవాలని కోరుతున్నారు.



పెన్షనర్లు

హామీలు అమలు చేయాలి



అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించడంతోపాటు ఈహెచ్ఎస్, డెత్ రిలీఫ్‌లు, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ ఆ సమస్యలు అలాగే ఉన్నాయి. హామీలను నెరవేర్చి, పెన్షనర్లకు ఆదుకోవాలి.

- పెద్దనగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రా పెన్షనర్ల పార్టీ

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పెన్షనర్లు దాదాపు 25వేల మంది ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పెన్షనర్లకు 2018 జూలై 1 నుంచి డీఆర్ అరియర్స్‌ను పెండింగ్‌లో ఉంచింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు పెన్షనర్లు చెబుతున్నారు. డీఏ అరియర్స్ విడుదల చేయడంతోపాటు, 1-7-2023 పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇంతవరకూ అమలు చేయకపోవడంతో గతేడాదివి రెండు, 2025లో ఒకటి కలిపి మరో మూడు డీఆర్ అరియర్స్ పెండింగ్ లిస్టులోకి చేరిపోయాయని ఆవేదన చెందుతున్నారు. ఈ లెక్కన దాదాపు ఒక్కో పెన్షనర్‌కు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్ష వరకూ డీఆర్ అరియర్స్ రూపంలో అందాల్సి ఉందని చెబుతున్నారు. అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ విషయంలోనూ 70 ఏళ్ల వయసున్న పెన్షనర్లకు 10 నుంచి 7 శాతానికి, 75 ఏళ్ల వయసు వారికి 15 శాతం నుంచి 12 శాతానికి వైసీపీ ప్రభుత్వం కుదించి ఆర్థికంగా దెబ్బతీసింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో వాటిని పూర్వస్థితికి తీసుకొస్తామని హామీ ఇచ్చినా.. ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో పెన్షనర్లకు ఎదురుచూపులు తప్పడంలేదు. ఈహెచ్ఎస్ పరిధిలో ప్రస్తుతం కేవలం కంటి, మోకాళ్లు, పంటి తదితర చిన్న చిన్న వాటికే వైద్యం చేయడం... సర్జరీలు జరిగిన వారికి అందించాల్సిన మెడికల్ రీయింబర్స్‌మెంట్లు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నెలనెలా పెన్షన్ శాతాన్ని బట్టి రూ.225 నుంచి రూ.300 ఈహెచ్ఎస్ కింద జమవుతున్నా... బిల్లులు రాకపోవడంతో డబ్బులు వెచ్చించి సర్జరీలు చేయించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పెన్షనర్ చనిపోతే దహన సంస్కారాలకు అందించే డెత్ రిలీఫ్ మత్తం రూ.25 వేలు కూడా ఇవ్వట్లేదు. వీటిన్నింటినీ పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారనీ, వాటిని వీలైనంత త్వరగా అమలు చేసి, ఆదుకోవాలని కోరుతున్నారు.

డెత్ రిలీఫ్‌లను విడుదల చేయాలి



చనిపోయిన పెన్షనర్లకు తక్షణసాయం కింద అందించే డెత్ రిలీఫ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం వాటిని రూ.10 వేలకు పరిమితం చేసింది. మునుపటిలా ఆ మొత్తాన్ని రూ.25 వేలకు పెంచి, పెన్షనర్లను ఆదుకోవాలి. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఆర్ అరియర్స్‌ను విడుదల చేయడంతో పాటు... పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసిన 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న మరో మూడు డీఆర్ అరియర్స్‌ను విడుదల చేయాలి.

- రామకృష్ణ, జిల్లా కోశాధికారి, ఏపీ పెన్షనర్ల సంఘం

మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను పెంచాలి



టీడీపీ హయాంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద రూ.2 లక్షల వరకూ వర్తించేది. వైసీపీ హయాంలో దానిని పెంచకపోగా... రూ.2 లక్షలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టింది. ఈహెచ్ఎస్ ఊసేలేకుండా చేసింది. పెన్షనర్లు చేతినుంచి డబ్బులు పెట్టుకోవాల్సి వచ్చింది. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం ఈహెచ్ఎస్ కింద కంటి, పంటి, మోకాళ్ల తదితర వాటికి మాత్రమే అమలు చేస్తున్నారు. సర్జరీలు చేయించుకున్న పెన్షనర్లు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారు. వాటిని విడుదల చేయడంతో పాటు... రీయింబర్స్‌మెంట్‌ను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలి.

-ప్రభాకర్, జిల్లా నిర్వాహక కార్యదర్శి, ఏపీ పెన్షనర్ల సంఘం

కోయంబత్తూరు నుంచి కాల్..!

- డీఎస్సీ సెలెక్ట్ అభ్యర్థి వీడియో కాల్
- సర్టిఫికెట్ల పరిశీలనకు వస్తున్నానంటూ సమాచారం
- కొత్తగా ముగ్గురు డీఎస్సీ అభ్యర్థులకు కాల్ లెటర్లు
- ఇద్దరి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి



కోయంబత్తూరు నుంచి వీడియో కాల్‌లో ఐటీ సెల్ ఏపీఓతో మాట్లాడుతున్న డీఎస్సీ సెలెక్ట్ అభ్యర్థి రమ్యశిల్ప

అనంతపురం విద్య, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో అనర్హుల ఏరివేత కొనసాగుతోంది. అదే సమయంలో అర్హులు ఎక్కడున్నా అవకాశం కల్పిస్తున్నారు. డీఎస్సీ రాసిన అభ్యర్థులు తుది జాబితాలో చోటు దక్కకపోవడంతో ఆశలు వదులుకున్నారు. తమ పనుల్లో నిమగ్నమయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన పకడ్బందీగా చేపట్టడంతో బోగస్‌లు బయటపడ్డారు. వారిని రిజెక్ట్ చేయడంతో కొత్త వారిని అవకాశం వెతుక్కుంటూ వెళ్తోంది. తాజాగా మరో ముగ్గురు డీఎస్సీ అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖాధికారులు కాల్ లెటర్లు పంపారు. సాయంత్రంలోగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని అందులో ఆదేశించారు. కోయంబత్తూరులో ఉన్న ఓ అభ్యర్థి.. విద్యాశాఖ అధికారులకు వీడియో కాల్ చేశారు. తాను కోయంబత్తూరులో ఉన్నానంటూ సమాచారం ఇచ్చారు.

మళ్లీ.. మళ్లీ.. పరిశీలన

నిబంధనల మేరకు అర్హత ఉంటే ఎక్కడ ఉన్నా ఉద్యోగం వస్తుందనడానికి డీఎస్సీ-2025 నియమకాల ప్రక్రియే నిదర్శనం. జిల్లాలో 807 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. వేలాదిమంది అభ్యర్థులు పోటీపడ్డారు. ఈసారి బోగస్‌లను ఏరివేసి నిజమైన అర్హులకే ఉద్యోగాలు కట్టబెట్టాలని సర్కారు పటిష్ట చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే డీఎస్సీ నియామకాల ప్రక్రియను రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 773 మంది అభ్యర్థులకు ఎంపిక కాల్ లెటర్లు వచ్చాయి. వారందరి ఒరిజనల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ నేతృత్వంలో ప్రత్యేక కమిటీలు పరిశీలించాయి. ఇప్పటికి ఐదుసార్లు పరిశీలన చేయించారు. అనుమానం, ఆరోపణలు వచ్చిన అభ్యర్థుల సర్టిఫికెట్లపై సంబంధిత శాఖలకు పంపి, అక్కడి నుంచి ఆమోదం లభిస్తేనే ఆమోదం తెలుపుతున్నారు. లేదంటే రిజెక్ట్ చేస్తున్నారు. ఇలాంటివి జిల్లాలో 14 తిరస్కరించారు. మరో నాలుగైదింటిపై సంబంధిత శాఖల నివేదికల కోసం వేచి చూస్తున్నారు.

తాజాగా మరో ముగ్గురికి కాల్‌లెటర్లు

డీఎస్సీ నియామకాల ప్రక్రియ ముగింపు దశకు చేరుకోవడంతో పూర్తిస్థాయిలో సెలెక్షన్ లిస్టు తయారు చేసి ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే డ్యూయల్ పోస్టులు, అసత్య సమాచారంతో రిజెక్ట్ అయిన అభ్యర్థుల స్థానంలో ఆ తరువాతి స్థానాల్లో ఉన్న వారికి రాష్ట్రశాఖ కాల్‌లెటర్లు పంపిస్తోంది. అందులో భాగంగా గురువారం మరో ముగ్గురు డీఎస్సీ అభ్యర్థులకు కాల్‌లెటర్లు వచ్చాయి. ఆ జాబితాలో ఉన్న అభ్యర్థులను పిలిపించుకుని సాయంత్రంలోగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి, నివేదికలు పంపాలని రాష్ట్ర శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇద్దరు అభ్యర్థులు జిల్లాలోనే ఉన్నారు. వారు సాయంత్రానికి సర్టిఫికెట్లు తీసుకొచ్చి పరిశీలన చేయించుకున్నారు. రాయదుర్గానికి చెందిన అభ్యర్థి రమ్యశిల్ప కోయంబత్తూరులో ఉన్నట్లు విద్యాశాఖ అధికారులకు తెలిపారు. వీడియోకాల్ చేసి కోయంబత్తూరులో ఉన్నాననీ, బయల్దేరానంటూ విద్యాశాఖ ఐటీసెల్ సిబ్బందికి వివరణ చేసుకున్నారు. అదేవీడియో కాల్ మాటలను రికార్డు చేసుకుని, డీఈఓ ప్రసాద్‌బాబుకు ఆమె పంపించారు. దీనిని బట్టి అర్హత ఉంటే ఎక్కడున్నా ఉద్యోగం వస్తుందని స్పష్టమైంది.

సభ సక్సెస్‌కు పూల బాట

- సూపర్ 'హిట్' కోసం ఆర్టీసీ జోనల్ చైర్మన్ ప్రత్యేక చొరవ



బస్సుల ఏర్పాటుపై మంత్రులు, కలెక్టర్, అధికారులతో చర్చిస్తున్న పూల నాగరాజు(ఫైల్)

అనంతపురం టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ -సూపర్ హిట్ విజయోత్సవ సభకు బస్సుల సమీకరణలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ప్రత్యేక చొరవ చూపారు. వారం రోజులుగా జిల్లా కేంద్రంలోనే ఉండి సభ విజయవంతానికి కృషి చేశారు. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితోపాటు ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులతో పూల నాగరాజు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి బస్సుల సమీకరణపై చర్చలు జరిపారు. సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది కలగని విధంగా ఆర్టీసీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సమీకరించాల్సిన బస్సులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి మంత్రి ద్వారా ఆమోదం పొందారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 3050 ఆర్టీసీ బస్సులు, 600 ప్రైవేట్ బస్సులను ముఖ్యమంత్రి సభకు ఏర్పాటు చేయించి సభ విజయవంతంలో తన వంతు పాత్ర పోషించారు.

అనుకున్న లక్ష్యాన్ని సాధించాం

- పూల నాగరాజు, ఆర్టీసీ జోనల్ చైర్మన్

సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభకు 2 లక్షల మందిని తరలించాలనే లక్ష్యంతో బస్సుల ఏర్పాట్లకు మంత్రులు, జిల్లా అధికారుల సహకారంతో చర్యలు చేపట్టాం. అయితే మేము అనుకున్న లక్ష్యం మేరకు ప్రజలు తరలి వచ్చారు. కొన్ని రూట్లలో బస్సులు నిండిపోయి టాపు పైన కూడా ఎక్కి అభిమానులు తరలివచ్చారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి కూటమి ప్రభుత్వంపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

డీఎఫ్ఓ విఘ్నేష్ బదిలీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) విఘ్నేష్ అప్పావు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐఎఫ్ఎస్ అధికారులను ప్రభుత్వం గురువారం బదిలీ చేసింది. ఈ క్రమంలో డీఎఫ్ఓ విఘ్నేష్‌ను ఆత్మకూరులోని నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్)కు డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డీఎఫ్ఓగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

విద్యార్థులు క్రమ శిక్షణతో ఉన్నత స్థానాలకు ఎదగాలి

- రాష్ట్ర మైనార్టీ కమిషన్ అధ్యక్షుడు నిసార్ అహ్మద్

రాయచూరు సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిర్దేశిత లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదల క్రమ శిక్షణతో సాధన చేస్తూ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాష్ట్ర మైనార్టీ కమిషన్ అధ్యక్షుడు నిసార్ అహ్మద్ విద్యార్థులకు ఉద్బోదించారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం నగర సమీపంలోని చంద్రబండా రోడ్డులోగల మైనార్టీ మురార్జి దేసాయి వసతి పాఠశాలను నిసార్ అహ్మద్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యేకంగా సంవాద కార్యక్రమం నిర్వహించిన ఆయన వారి లక్ష్యాలను ఉద్దేశాలను అందుతున్న విద్యను వసతి పాఠశాలలోని సౌకర్యాల గురించి విపులంగా చర్చించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి బోధనలో కేవలం పాఠ్యాంశాలే కాకుండా విద్యార్థుల్లో నైతిక ప్రవర్తనను పెంపొందించాలన్నారు.



మాట్లాడుతున్న నిసార్ అహ్మద్

దేశభక్తి సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కల్పిస్తు వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. అదే సమయంలో బోధనలో నూతన పద్దతులను అవలంభించాలని సూచించారు. ఈ ఏడాది టెన్త్(ఎస్ఎస్ఎల్‌సీ) ఫలితాలను పెంచాలని తద్వార పాఠశాలకు గుర్తింపును తీసుకురావాలని సూచించారు. అనంతరం జిల్లా సంక్షేమ శాఖ అధికారితో మాట్లాడిన చైర్మన్ పాఠశాలకు తరచుగా జిల్లాధికారి, జిల్లా ఎస్పీ వంటి ప్రముఖులను రప్పించి సందేశాత్మకమైన ఉపన్యాసాలను వారి ద్వార అందించే ఏర్పాటు చేయాలని సూచించారు.

లారీ బీభత్సం..!

- మహిళా కార్మికుల ఆటోను ఢీకొని ఆపకుండా ముందుకు..
- దారిలో ద్విచక్రవాహనాన్ని ఈడ్చుకెళ్లిన వైనం
- కిలోమీటర్ల మేర బైక్‌లపై వెంబడించిన స్థానికులు
- లారీలు అడ్డుగా పెట్టి పట్టుకుని.. డ్రైవర్‌కు దేహశుద్ధి



లారీని ద్విచక్రవాహనాల్లో వెంబడిస్తున్న యువకులు





గాయపడిన అన్నపూర్ణ, ఉమాదేవి

హిందూపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో గురువారం సాయంత్రం లారీ బీభత్సం సృష్టించింది. మహిళా కార్మికుల ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. డ్రైవర్ ఆపకుండా అలానే ముందుకెళ్లాడు. స్థానికులు బైక్‌లలో వెంబడించారు. దారిలో మరో బైక్‌ను లారీ కిలోమీటరు మేర ఈడ్చుకెళ్లింది. దాదాపు 10 కిలోమీటర్ల మీర స్థానికులు బైక్‌లలో వెంబడించారు. ఆ ఛేజింగ్ సీన్ సినిమా స్టంట్‌ను తలపించింది. ఆఖరుకు రోడ్డుకు అడ్డుగా లారీలను ఉంచి, పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని, అతడిని అదుపులోకి తీసుకున్నారు. హిందూపురం పట్టణ పరిధి కొల్లకుంట సమీపంలో సాయంత్రం గార్మెంట్స్ కార్మికులతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో అన్నపూర్ణ, ఉమాదేవికి గాయాలయ్యాయి. లారీ ఆపకుండా పెనుకొండ వైపు వెళ్తుండగా అక్కడున్న కొంతమంది యువకులు సుమారు 10కి.మి. మేర ద్విచక్రవాహనాల్లో వెంబడించారు. దారిలో పక్కనే ఆపిన బైక్‌ను సైతం లారీ కిలోమీటరు మేర ఈడ్చుకెళ్లింది. ఆఖరుకు చాలకూరు-బ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య లారీని పట్టుకుని, డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న సోమందేపల్లి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, లారీని సోమందేపల్లి స్టేషన్‌కు తరలించారు. గాయపడినవారిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన డీహెచ్ఓ

రాయచూరు సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గడచిన వారం రోజులుగా స్వల్పకాలిక జ్వరం, దగ్గు, జలుగు వంటి రోగాలతో బాద పడుతూ భయాందోళనలకు గురవుతున్న హాలభావి గ్రామస్థులకు డీహెచ్ఓ డాక్టర్ సురేంద్ర బాబు ధైర్యం చెప్పారు. గురువారం ఈ చనాళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సపొందుతున్న హాలభావి గ్రామస్థులను డీహెచ్ఓ పరమార్శించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడిన డీహెచ్ఓ వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల కొంత వైరల్ ఫీవర్‌ల కారణంగా దగ్గు, జ్వరం వంటివి చోటు చేసుకున్నట్లు వివరించారు. అదే సమయంలో ఎవ్వరికి ఎలాంటి డెంగీ లక్షణాలు లేవని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



మహాదేవ్(ఫైల్)

రాయచూరు సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని హట్టి పట్టణ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మహాదేవ్(18) దుర్మకరణం పాలైయ్యాడు. శాహపూర్ తాలూకా మద్దగిరి గ్రామానికి చెందిన మహాదేవ్ హట్టి పట్టణంలోని తమ అమ్మమ్మగారి ఇంట్లో ఉండి ఇంటర్(పీయూసీ) విద్యనభ్యశిస్తుండగా తోటి విద్యార్థులతో కలిసి లింగసుగూరు నుంచి రాత్రి హట్టికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన మహాదేవ్ ఆరోగ్యం విషమిస్తుండడంతో 108 వాహనం సకాలంలో రానందున స్థానికులు ప్రైవేటు వాహనంలో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మార్గమధ్యంలోనే మహాదేవ్ మృత్యువాత పడ్డాడు. ప్రమాదంలో గాయపడిన మరో యువకుడికి కుడికాలు పూర్తి నుజ్జునుజ్జు కాగా వైద్య చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు ప్రమాదంలో గాయపడగా వారిని హట్టి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సనందిస్తున్నారు. విషయం తెలుసుకున్న హట్టి పట్టణ పోలీసులు సంఘటన స్థళాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సింగపూర్‌కు ధర్మవరం విద్యార్థినులు

- ఫ్లోర్‌బాల్ పోటీలకు 12 మంది ఎంపిక

ధర్మవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఫ్లోర్‌బాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ చూపినట్లు హెచ్ఎం జ్యోతిలక్ష్మి, పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం, పీడీ మాట్లాడుతూ గత నెలలో నరసరావుపేటలో జరిగిన 19వ నేషనల్ ఫ్లోర్‌బాల్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్-14 విభాగంలో 14 మంది జాతీయ స్థాయిలో పాల్గొనగా 12మంది అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. 8వతరగతికి చెందిన గీతిక, హేమశ్రీ, అఫ్నా అంజన్, రోహిణి, సాయిగీతిక, జాహ్నవి, 9వతరగతికి చెందిన తేజశ్రీ, నందిని, ఉషశ్రీ, శ్రీదేవి, ఈశ్వరి, గౌతమి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. వీరు ఈనెల నాలుగో వారం లేదా అక్టోబరు మొదటి వారంలో సింగపూర్‌లో నిర్వహించే ఫ్లోర్‌బాల్ అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వీరిని బీఎస్ఆర్ బాలుర ఉన్నతపాఠశాల హెచ్ఎం మేరి వరకుమారి, పాఠశాల కమిటీ చైర్మన్ బాబావలి, ఉపాధ్యాయులు అభినందించారు.



అంతర్జాతీయ ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పాఠశాల హెచ్ఎం, పీడీలు

ఒకే ఒక్కడు !

మూడేళ్లలో మూడువేలకుపైగా కంటి శస్త్ర చికిత్సలు

- రాష్ట్రంలోనే జిల్లాను టాప్‌లో నిలిపిన డాక్టర్ సైదన్న
- అరకొర సౌకర్యాలతోనే అన్నీ తానై నిర్వహిస్తున్న వైద్యుడు



డాక్టర్ సైదన్నతో కంటి శస్త్రచికిత్స చేయించుకున్న వారు (ఫైల్)




నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సైదన్న


అనంతపురం వైద్యం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఒకే ఒక్కడు. మూడేళ్లలో మూడువేలకు పైగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి రికార్డు సృష్టించాడు. జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో నేత్రవైద్య నిపుణుడిగా పని చేస్తున్న డాక్టర్ సైదన్న ఎన్‌పీసీబీవీఐ (నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ అండ్ విజువల్ ఇంపైర్‌మెంట్) ద్వారా మూడేళ్లలో 3,160 ఉచిత కంటి ఆపరేషన్లు చేసి రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలిపారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 5వరకు 15 రోజుల పాటు నిర్వహించిన జాతీయ నేత్ర దాన అవగాహన సదస్సుల్లో భాగంగా డాక్టర్ సైదన్న విద్యాసంస్థలు, జన సమూహ ప్రాంతాలకెళ్లి నేత్ర దానం, అంధత్వ నివారణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అన్నీ తానై..

జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డీఎంహెచ్ఓ కార్యదర్శిగా ఎన్‌పీసీబీవీఐ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో ఎన్‌పీసీబీవీఐ నిర్వహణ కోసం ప్రభుత్వ సర్వజన వైద్యశాల అనుబంధ క్యాన్సర్ యూనిట్‌లో ప్రత్యేక ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఇందులో వారంలో రెండు రోజు పాటు ఆపరేషన్లు చేస్తూ పేదలకు చూపును ప్రసాదిస్తున్నారు. శస్త్ర చికిత్సలు చేయడానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందడంలేదని తెలుస్తోంది. ఓపీ, ఐపీ, ఓటీ మూడు విభాగాలకు సరిపడా సిబ్బంది ని నియమించడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఓటీ అసిస్టెంట్, ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, స్టాఫ్ నర్స్, అటెండర్లు ఇలా అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్నీ తానై డాక్టర్ సైదన్న ఆపరేషన్లు చేసి ఎంతో మంది పేదలకు చూపును ప్రసాదిస్తున్నారు. ఎన్‌పీసీబీవీఐ నిర్వహణపై ఉన్నతాధికారులు అలసత్వాన్ని వీడి చేయూతని ఇవ్వాల్సిన అవసరం ఉంది.



సృష్టిలో ఏకైక సేవామార్గం



నేత్ర దానం కంటే సృష్టిలో గొప్పసేవా మార్గం మరొకటి లేదు. మరణాంతరం నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చు. డాక్టర్‌గా నాకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్‌పీసీబీవీఐ ద్వారా నేత్ర శస్త్రచికిత్సలు చేస్తున్నా. మూడేళ్లలో 3,160 కంటి ఆపరేషన్లు చేశా. ఆపరేషన్ చేయించుకున్న ప్రతిఒక్కరూ తిరిగి చూపును పొందుతున్నారు. దీంతో జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల వారు తరలివస్తున్నారు.

- డాక్టర్ సైదన్న, ఎన్‌పీసీబీవీఐ, ఆప్తాల్మిక్ సివిల్ సర్జన్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

శివశంకర శాస్త్రి (జయంతి)



తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి 1892 సెప్టెంబరు 12న గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామంలో జన్మించారు. సాహితీవేత్త, నాటక రచయిత, నాటక ప్రయోక్త, దర్శకుడు. భావకవితా ఉద్యమ పోషకుడు. తెనాలిలోని శ్రీరామవిలాస సభ నాటకసంస్థలో దర్శకుడిగా పనిచేశారు. హిందీ, ఆంగ్ల, బెంగాలీ, సంస్కృతం, పాళీ భాషాలలో నిష్ణాతుడు. ఆయా భాషలనుంచి తెలుగులోకి అనేక గ్రంథాలను అనువదించారు. నవసాహిత్య పరిషత్తు, సాహితీసమితి వంటి సంస్థలను స్థాపించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో రెండుసార్లు కారాగార శిక్ష అనుభవించారు. 1972లో కన్నుమూశారు.

అయ్యప్ప పణిక్కర్ (జయంతి)



మళయాళ కవి, సాహితీవేత్త, పద్మశ్రీ గ్రహీత అయ్యప్ప పణిక్కర్ 1930 సెప్టెంబరు 12న కేరళ రాష్ట్రం అలప్పుజా జిల్లా కావలం గ్రామంలో జన్మించారు. 25కుపైగా రచనలు ప్రచురితమయ్యాయి. 1960లో కురుక్షేత్రం రచన ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. అనేక ప్రముఖ రచనలు మళయాళంలోకి అనువాదం చేశారు. సాహిత్య అకాడమీకి ప్రధాన సంపాదకులుగా వ్యవహరించారు. కేరళ సాహిత్య అకాడమీ, సరస్వతీ సమ్మాన్, కేంద్ర సాహిత్య అకాడమీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2006 ఆగస్టు 23న కన్నుమూశారు.

నోర్మన్ బోర్లాగ్ (వర్ధంతి)



హరిత విప్లవ పితామహుడు, నోర్మన్ ఎర్నెస్ట్ బోర్లాగ్ 1914 మార్చి 25న అమెరికా దేశం అయోవా ప్రాంతంలోని వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. మైక్రో బయాలజిస్ట్‌గా ఎన్నో పరిశోధనలు చేశారు. చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే పొట్టిరకం గోధుమ వంగడాలను ఆవిష్కరించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ప్రజలను ఆకలిబాధల నుంచి, పస్తుల నుంచి రక్షించినవారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత. 95 యేట 2009 సెప్టెంబరు 12న కన్నుమూశారు.

అమల అక్కినేని (పుట్టినరోజు)



ప్రముఖ నటి అమల 1967 సెప్టెంబరు 12న కోల్కత్తాలో జన్మించారు. భరతనాట్య కళాకారిణి, జంతు ప్రేమికురాలు. బ్లూక్రాస్ సంస్థ సహసంస్థాపకులు. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ, మళయాళం సినిమాలలో నటించి 2 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. 1980వ దశకంలో హీరోయిన్‌గా రాణించారు. యువ సామ్రాట్ నటుడు నాగార్జున సతీమణి. జీవదయా పురస్కార్, నారీశక్తి అవార్డు తదితర గౌరవాలు అందుకున్నారు.

నలుగురు ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం

బెంగళూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : విధానపరిషత్ సభ్యులుగా నామినేట్ అయిన నలుగురిని సభాపతి బసవరాజహొరట్టి ప్రమాణస్వీకారం చేయించారు. గురువారం విధానసౌధ బ్యాంక్వెట్ హాలులో కార్యక్రమం జరిగింది. ఆరతి కృష్ణ, రమేష్‌బాబు, ఎఫ్‌హెచ్ జక్కప్పనవర్, కే. శివకుమార్‌లు ప్రమాణం చేశారు. ఒకరి తర్వాత మరొకరి చేత సభాపతి ప్రమాణస్వీకారం చేయించారు. ఇదే సందర్భంలోనే పరిషత్ నిబంధనల పుస్తకాలను బహిరంగపరిచారు. సభాపతి హొరట్టి మాట్లాడుతూ సభాకలాపాల వేళ ఎలా వ్యవహరించాలనేది ముందుగా అవగాహనన పొందాలని హితవు పలికారు. పరిషత్ కలాపాల వేళ ఎక్కువ సమయం గడపాలని కొత్త అంశాలను తెలుసుకోవడంతో పాటు ప్రజాసమస్యలపై సభ ముందుకు ప్రస్తావనలు తీసుకువచ్చి పరిష్కారానికి కారకులు కావాలన్నారు. సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు కొత్త సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. మంత్రులు పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్, వెంకటేష్, జమీర్‌అహ్మద్, బోసురాజు తదితరులు పాల్గొన్నారు. కాగా నలుగురి సభ్యులలో రమేష్ బాబు ఇప్పటికే జేడీఎస్ పార్టీ నుంచి ఓ విడత సభ్యుడిగా కొనసాగారు. మిగిలిన ముగ్గురు పరిషత్‌లో ప్రవేశించడం ఇదే తొలిసారిగా ఉంది. కానీ ఆరతి కృష్ణ దాదాపు దశాబ్దాల కాలంగా క్రియాశీలక రాజకీయాలలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆమె కాంగ్రెస్ పార్టీ విదేశీ వ్యవహారాల విభాగం అధ్యక్షురాలుగా కొనసాగుతున్నారు. ఇటీవల పదేళ్ళకాలంగా విదేశాలలో ఏర్పడిన భారీ ప్రమాదాలు, యుద్దాల వేళ ప్రవాస భారతీయుల కోసం ప్రత్యేకంగా పనిచేసేవారు.



ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్సీలతో సీఎం, డీసీఎం, సభాపతి

శాశ్వత వీసీలు లేక కుంటుపడుతున్న పాలన

- యూనివర్సిటీలపై దృష్టి పెట్టని ప్రభుత్వం
- సంవత్సరాల తరబడి ఇన్‌చార్జీలతోనే..

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 32 విశ్వవిద్యాలయాలపైకి 6 వర్సిటీలలో శాశ్వత వీసీలు లేరు. ఈ 6 విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జ్‌లే కొనసాగుతున్నారు. దీంతో విద్య, పాలనా వ్యవహారాలకు సమస్యగా మారింది. కలబురగి యూనివర్సిటీ, డాక్టర్ గంగూబాయి హానగల్ సంగీత, కళల విశ్వవిద్యాలయం, బెంగళూరు మహారాణి క్లస్టర్ యూనివర్సిటీ, నృపతుంగ యూనివర్సిటీ, బెంగళూరునగర విశ్వవిద్యాలయం, మండ్య విశ్వవిద్యాలయాలలో పూర్తిఅవధి కులపతులు లేక ఇన్‌చార్జ్‌లే కొనసాగుతున్నారు. మండ్య వర్సిటీ, నృపతుంగ వర్సిటీ, మహారాణి క్లస్టర్ వర్సిటీలకు 2024 నుంచి పర్మనెంట్ వైస్‌చాన్స్‌లర్‌లు లేరు. గుల్బర్గా వర్సిటీ, బెంగళూరు నగర, డాక్టర్ గంగూబాయి హానగల్ సంగీత వర్సిటీలకు కొన్ని నెలలుగా పర్మనెంట్ కులపతులు లేరు.

బెంగళూరు నగర విశ్వవిద్యాలయం, గుల్బర్గా విశ్వవిద్యాలయాల కులపతుల నియామకానికి సంబంధించి ఆడిట్ కమిటీ ఇప్పటికే ముగ్గురు పేర్లను సిఫారసు చేసింది. అది ఇంకా సీఎం పేషీ నుంచి రాజ్‌భవన్‌కు చేరలేదు. ఇక నృపతుంగ వర్సిటీ, మండ్య వర్సిటీ, మహారాణి క్లస్టర్ విశ్వవిద్యాలయాలు ఇతర విశ్వవిద్యాలయాలతో విలీనం చేయాలా లేదా ఆర్థికంగా బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటారా..? అనేది మంత్రివర్గ ఉపసమితి పరిశీలనలో ఉంది. దీంతో వీసీల నియామక ప్రక్రియ ఎటూ తేలలేదు.

ప్రధాన సమస్యలు

వర్సిటీలలో ఇన్‌చార్జ్ వీసీలు కొనసాగుతున్నందున దీర్ఘకాలిక విద్యా ప్రణాళికలు రూపొందించలేరు. సిబ్బంది నియామకం సాధ్యం కాదు, కొత్త కోర్సుల ప్రారంభానికి అనుమతులు కష్టం. ప్రముఖ ఆర్థిక నిర్ణయాలు తీసుకోలేరు.



సిండికేట్ సభ్యులనుంచి సహకారం ఉండదు.

ఉన్నతవిద్యాశాఖ మంత్రి డాక్టర్ సుధాకర్ అభిప్రాయం మేరకు విశ్వవిద్యాయాలలో ఖాళీగా ఉన్న ఉపకులపతుల నియామకాల వివిధ దశలలో ఉన్నాయి బెంగళూరు నగర, గుల్బర్గా వర్సిటీలకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయంలో నిర్ణయం పెండింగ్‌లో ఉందన్నారు. సంగీత విశ్వవిద్యాలయానికి అర్హులైనవారు లభించడం లేదన్నారు. ఇక మూడు వర్సిటీల అంశం మంత్రివర్గ ఉపసమితి పరిశీలనలో ఉందన్నారు.

చట్టసభల్లో నిర్ణయాలే కీలకం



సావనీర్ విడుదల చేస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, సీఎం తదితరులు



స్పీకర్లకు సన్మానం

(5వపేజీ తరువాయి)సహకారం, అభిమానానికి ధన్యవాదాలన్నారు. విద్య, పంచాయతీరాజ్, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర శాఖల మంత్రిగా వ్యవహరించానని ప్రత్యేకించి విద్యావ్యవస్థలో పారదర్శకతకోసం పాటుపడ్డానన్నారు. రాష్ట్రసాంస్కృతిక రాయబారి బసవణ్ణ ఆదర్శాలు, ఆయన రూపొందించిన అనుభవ మంటపం తరహాలోనే పార్లమెంటరీ విధానం ఉందన్నారు. 1911లో సీపీఏ ఏర్పాటైందన్నారు. సమాజంలో కుల, మత, లింగబేధం లేకుండా అభివృద్ధికి దోహదపడేలా ఉండాలనేది లక్ష్యమన్నారు. యునైటెడ్ నేషన్స్ అజెండా 2030 ప్రకారం సుస్థిర ఆర్థిక అభివృద్ధి దిశగా నిర్ణయాలు ఉంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సీపీఏ సమ్మేళనంలో వివిధ రాష్ట్రాల సభ్యులు భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన నృత్యరూప ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ ఉపసభాపతి హరివంశ, సీఎం సిద్దరామయ్య, శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, వివిధ రాష్ట్రాల శాసనసభల స్పీకర్‌లు, సభాపతులు, మాజీ అధ్యక్షులు, స్పీకర్‌లు, కామన్వెల్త్ ప్రధాన కార్యదర్శి స్టీఫన్‌ట్విగ్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న స్పీకర్ యూటీ ఖాదర్, డీసీఎం డీకే శివకుమార్



అభినందిస్తున్న సీఎం సిద్దరామయ్య



విద్యుత్ కాంతుల్లో విధానసౌధ



నృత్య ప్రదర్శనలో కళాకారులు

హోసూరులో అంతర్జాతీయ విమానాశ్రయం

(5వపేజీ తరువాయి) పైగా పెట్టుబడులు పెట్టేలా పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవటం సంతోషంగా ఉందన్నారు. అంతే కాకుండా ఎనిమిదివేల మందికి ఉపాధి కలిగించేలా రూ.1600 కోట్లతో చేపట్టనున్న నాలుగు పథకాలకు శంకుస్థాపన చేయడం కూడా సంతోషకరమన్నారు. గత నాలుగున్నరేళ్లలో తమ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల్లో 77 శాతం మేర కొత్త కర్మాగారాలు ఏర్పాటయ్యాయని, ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీల్లో విస్తరణ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన వివరించారు.

92 ఒప్పందాలు... రూ.24,307 కోట్ల పెట్టుబడులు

ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక, వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో హోసూరులో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం 53 సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆ ప్రకారం ప్రముఖ కంపెనీలు రూ.23,303.15 కోట్ల మేరకు పెట్టుబడులతో కొత్త ఫ్యాక్టరీలు నెలకొల్పి 44,870 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఎంఎస్ఎంఈ శాఖ ఆధ్వర్యంలో రూ.10003.85 కోట్లతో 4483 మందికి ఉపాధి కల్పించేలా 39 ఒప్పందాలు కూడా కుదిరాయి. ఈ మొత్తం 24,307 కోట్ల పెట్టుబడులతో 92 ఒప్పందాలతో 49,353 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ సదస్సు అనంతరం గురువారం సాయంత్రం డెల్టా ఎలక్ట్రానిక్స్ సంస్థ న్యూ డెల్టా స్పాట్ ఉత్పత్తి కేంద్రాన్ని కూడా స్టాలిన్ ప్రారంభించారు.

కుక్కకాటుపై నిర్లక్ష్యం వద్దు

- అవగాహన కార్యక్రమంలో డాక్టర్ మరియంబి



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మరియంబి

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కలేదా వీధి కుక్క కరవడం గాని, గోళ్ళతో శరీరంపై గాయడం చేయడం చేస్తే ఎలాంటి పరిస్థితిలోనైనా నిర్లక్ష్యం చేయరాదని, వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి ఆంటీ ర్యాబీస్ టీకాలు వేయించుకోవాలని డాక్టర్ మరియంబి వి.కె. ప్రజలను కోరారు. జిల్లా పాలనా మండలి, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా సర్వేక్షణా విభాగం, నగర కౌల్‌బజార్ ప్రాథమిక ఆరోగ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో కుక్క, పాముకాటుకు గురైన సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. రేబీస్, పిచ్చి కుక్క కాటు గురైన వ్యక్తులు వెంటనే యాంటీ రాబిస్ టీకా వేయించుకుని రేబీస్ వ్యాధి రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ర్యాబిస్ వ్యాధి సోనిక వారు నీరు తాగరని, గాలి వీస్తే భయపడుతారని, వెలుగు చూస్తేనే ఉల్కిపడి లేస్తారని, కుక్క కాటు మొదడుకు సమీపంలో ఉంటే మరింత ప్రమాదమని ఒక్కోసారి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని తెలలిపారు. వైద్యులు సలహా మేరకు కుక్క కాటుకు గురైనవారు కాటుకు గురైన 3, 7, 28వ రోజుల్లో తప్పకుండా టీకా వేయించుకోవాలని సూచించారు. ఇళ్ళలో పెంపుడు కుక్కలకు ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేయించాలని సూచించారు. అదేవిధంగా పాముకాటుకు గురైన వారు ఆలస్యం చేయకుండా ఏదైనా వాహనం ద్వారా గాని 108 అంబులెన్స్ ద్వారా సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్ళి ప్రథమ చికిత్స చేయించాలన్నారు. పాము కాటుకు గురైన ప్రాంతంలో బట్టతో గట్టిగా కట్టడం గాని, బ్లేడ్, లేదా చాకుతో రక్త గాయడం చేయడం గాని, నాటి ఔషదారలు ఇవ్వడం లాంటివి చేయరాదని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఉప మేయర్ డి.సుకుం, వైద్యాధికారి డాక్టర్ నవీన్ అలమ్, డాక్టర్ విశాలాక్షి, డాక్టర్ స్వప్న, ఎన్‌సిడి సలహాదారులు జబీనా తాజ్, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బెంగళూరులో భారీ వర్షం

- పలు ప్రాంతాల్లో కూలిన భారీ వృక్షాలు



రాజాజీనగర్‌లో కూలిన భారీ వృక్షం

బెంగళూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర వ్యాప్తంగా బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 8గంటలకు ప్రారంభమైన వాన గురువారం తెల్లవారు జాము దాకా కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. రోడ్లు కాలువల తరహాలో మారాయి. రాత్రంతా కురిసిన మేరకు 52.8 మిల్లీమీటర్ల వర్షం నమోదయ్యింది. బెంగళూరు తరహాలోనే రాష్ట్రమంతటా బుధవారం రాత్రి వర్షం కురసింది. తీర ప్రాంత జిల్లాలు దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, ఉడుపి జిల్లాలతో పాటు ఉత్తరకర్ణాటక జిల్లాలు బాగల్‌కోటె, కొప్పళ తదితర జిల్లాలోను వర్షం కురిసింది. మలెనాడు ప్రాంతాలు కొడగు, చిక్కమగళూరు, శివమొగ్గ, దావణగెరెతో పాటు కావేరీ నదీ ప్రాంతం మైసూరు, మండ్య జిల్లాలోను వర్షం కురిసింది బెంగళూరు నగరం రాజాజీనగర్ ప్రాంతంలో కురిసిన వానధాటికి భారీ చెట్టు ఒకటి నేలకొరిగింది. గురువారం తెల్లవారు జామున 3గంటలకు చెట్టు కూలడంతో బయట ప్రజలు ఎవరూ లేని కారణంగా పెనుప్రమాదం తప్పినట్లు అయ్యింది. సుమారు నాలుగు కార్లు ధ్వంసమయ్యాయి. కాగా ఓ భారీ కొబ్బరి చెట్టు కూలిపోవడంతోను రెండు ఇళ్ళు, పలు వాహనాలు ధ్వంసమైనట్లు అధికారులు ప్రకటించారు.

ప్రియుడి కోసం భర్తను వదిలి వచ్చిన భార్య

- ఉద్యోగం రావడంతో వదిలించుకునేందుకు ప్రియుడి కుట్ర

బెంగళూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రియుడు నచ్చాడని ఏకంగా కొన్నేళ్ళు సంసారం చేసి ఇద్దరు పిల్లలు ఉన్న మహిళ భర్తను వదిలి వెళ్ళిపోయింది. అయితే ప్రియుడు మోసం చేశారంటూ దావణగెరె పోలీసులను బాధిత మహిళ ఆశ్రయించారు. వివరాలు ఇలా హుబ్బళ్ళికి చెందిన నవీన్ మూడేళ్ళుగా దావణగెరెలో పేపర్ వ్యాన్‌కు డ్రైవర్‌గా వ్యవహరిస్తూ ఇక్కడే గడిపేవారు. ఇలా హరపనహళ్ళికు చెందిన ఇద్దరు పిల్లల తల్లితో నవీన్‌కు పరిచయం ఏర్పడింది. అది కాస్త స్నేహంగా మారి ప్రేమకు దారి తీసింది. ఇద్దరు కలిసి జీవించాలని నిర్ణయించుకున్నారు. మహిళ ఇద్దరు పిల్లలతో పాటు నవీన్‌తో కలిసి ఉండేందుకు భర్తను వదిలి వచ్చేశారు. ఇలా కొంతకాలంగా ఇద్దరు లివింగ్ రిలేషన్‌షిప్‌లో కొనసాగారు. ఇటీవల నవీన్‌కు కేఎస్ఆర్టీసీలో డ్రైవర్ ఉద్యోగం లభించింది. ప్రభుత్వ ఉద్యోగం వచ్చినందున ఆమెను వదిలించుకోవాలని నవీన్ సిద్దమయ్యారు. ఇదే విషయమై ఇద్దరి మధ్య దావణగెరెలోని శ్యామనూరు రోడ్ వాటర్ ట్యాంక్ ప్రాంతంలో గొడవ జరిగింది. ఇలా ఉండగా నవీన్‌ను నమ్ముకుని భర్తకు విడాకులు ఇచ్చేందుకు కోర్టును ఆశ్రయించారు. ఆమె దావణగెరె లేఅవుట్ పోలీసుస్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేశారు. నవీన్ నుంచి న్యాయం చేయాలని తన నుంచి తీసుకున్న బంగారు ఆభరణాలు ఇప్పించాలని బుధవారం ఫిర్యాదు చేశారు.

యువకుడి దారుణ హత్య

పావగడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మధుగిరి తాలూకా పోలెనహళ్లిలో బుధవారం సాయంత్రం దళిత యువకుడు ఆనంద్ (28) దారుణ హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. పోలెనహళ్లి గ్రామంలో ఉదయం బిల్ కలెక్టర్ రామకృష్ణ ఇంటి ముందు ఉన్న కొళాయి నుంచి నీరు వృధాగా పోతోంది. దీంతో ఆనంద్ అటుగా వెళుతూ నీరు వృధా అవుతోంది.. కొళాయిని ఆపండి అని చెప్పాడు. దీంతో రామకృష్ణ కుమారుడు, గ్రామ పంచాయతీ సభ్యుడు నగేష్, కుటుంబ సభ్యులు ఆనంద్‌తో గొడవకు దిగారు. సాయంత్రం ఆనంద్ తన స్నేహితులతో వస్తుండగా నగేష్ బొలెరో వాహనంతో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ నేపథ్యంలో వాహనం నుంచి దిగి తన కుమారుడిని కొడవలితో దాడిచేసి హత్యచేసినట్లు మృతుడి తల్లి లక్ష్మీదేవమ్మ పోలీసులకు వివరించారు. వాహనంతో ఢీకొట్టి యాక్సిడెంట్‌గా చిత్రీకరించారని, అయితే అందులోవాస్తవం లేదని పోలీసుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అయితే నగేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆనంద్ పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత అది హత్యా..? లేక యాక్సిడెంటా..? అనేది తెలుస్తుందని పోలీసులు తెలిపారు. కాగా డీవైఎస్పీ మంజునాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మండిపడ్డ దళిత సంఘాలు

దళిత యువకుడు ఆనంద్ హత్యకు సంబంధించి దళిత సంఘర్షణ సమితి (డీఎస్ఎస్) ఆధ్వర్యంలో తుమకూరు జిల్లావ్యాప్తంగా నిరసన తెలిపారు. హోంమంత్రి జిల్లాలోనే ఈవిధంగా దళితులపై హత్యలు జరుగుతుంటే మిగతా జిల్లాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ హత్యపై హోంమంత్రి చొరవ తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని, ఇప్పటికైనా కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

దర్శకుడి కుటుంబ సభ్యులపై వరకట్నం కేసు

బెంగళూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ నటుడు, దర్శకుడు ఎస్ నారాయణ్‌తో పాటు భార్య, కుమారుడిపై వరకట్నం కేసు నమోదయ్యింది. గురువారం జ్ఞానభారతి పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నారాయణ్ రెండవ కుమారుడు పవన్ భార్య పవిత్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు పవిత్రా ఫిర్యాదులో పేర్కొన్న మేరకు 2021లో పవన్, పవిత్రాల వివాహం జరిగింది. వివాహం వేళ లక్ష రూపాయల నగదు, ఉంగరంతో పాటు పెళ్ళి ఖర్చులు మా తల్లిదండ్రులే భరించినట్లు పేర్కొన్నారు. పెళ్ళి జరిగిన మూడునెలల నుంచే ఇంట్లో ప్రతి విషయానికి గొడవలు చేశారన్నారు. అత్త, మావలు నోటికొచ్చినట్లు తిట్టేవారని దీంతో కలిసి ఉండలేక 2022లో భర్తతో కలిసి వేరు కాపురం పెట్టినట్లు పేర్కొన్నారు. పవన్ డిగ్రీ చదివినా ఉద్యోగం లేక పోవడంతో కుటుంబ అవసరానికి ఖర్చులు తల్లిదండ్రులే భరించారన్నారు. ఇదే తరుణంలోనే కారు కొనుగోలు చేసేందుకు నా డబ్బులు లక్ష రూపాయలు ఇచ్చానని, మా అమ్మ నుంచి పవన్ మరో రూ.75వేలు తీసుకున్నారన్నారు. మాకు కుమారుడు పుట్టిన మూడునెలలకు అత్తమావలు మరోసారి మా ఇంట్లోనే కలసి ఉండాలని కోరిన మేరకు వాపసు వెళ్ళామన్నారు. తిరిగి మామ ఇంటికి వెళ్ళాక అత్తమామలతో పాటు భర్త కూడా నిత్యం వేధించారన్నారు. మామ నారాయణ్ కళాసామ్రాట్ టీం అకాడమీ అనే ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌ను ప్రారంభించేందుకు డబ్బులు కోరగా మా తల్లిదండ్రులు బంగారం తాకట్టు పెట్టి పదిలక్షలు ఇచ్చారన్నారు. మరలా డబ్బులు తీసుకురావాలని కోరుతూ ఇబ్బంది పెడుతున్నారని ఇంటి నుంచి బయటకు పంపేశారన్నారు. ఆత్మరక్షణకు ఫిర్యాదు చేయాల్సి వచ్చినట్లు పవిత్రా ఫిర్యాదులో పేర్కొన్నారు.



దర్శకులు నారాయణ్, పెళ్ళినాటి చిత్రం(ఫైల్)



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,631.88
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	19.565	27,861
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	19,104	26,478
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.30

ఉల్లిపాయలు @ 8

- భారీగా పతనమైన ఉల్లి ధరలు
- క్వింటం రూ.800 నుంచి రూ.1000
- గిట్టుబాటు కావని రైతుల ఆవేదన



ఉల్లి గ్రేడింగ్ చేస్తున్న రైతులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతుకు కన్నీళ్లే మిగిలాయి. ఉభయ జిల్లాలు బళ్లారి, విజయనగరం జిల్లాల్లో ఉల్లిపాయ పంట కోతలు ప్రారంభమైయ్యాయి. అయితే పంట చేతికొచ్చే సరికి మార్కెట్లో ధరలు పతనం కావడం అన్నదాతలో ఆందోళన కలిగిస్తోంది. గత ఐదు సంవత్సరాలుగా ఉల్లిరైతులు ఎండు తెగులు, బూజు తెగలుతో భారీగా నష్టపోయారు. ఈసారి మంచి దిగుబడి వచ్చినప్పటికీ ధరలేక తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం జిల్లా హూవినహడగలి తాలూకాలో 1,500 హెక్టార్లలో ఉల్లి సాగు చేశారు. ఇట్టిగి, ఉత్తంగి, సోగి,తలకల్లు, మహాజనదహళ్ళి , కెంచమ్మనహళ్ళి ప్రాంతాల్లో ఉల్లిపాయలను అధికంగా పండించారు. హడగలి, హిరేహడగలి పరిధిలో తక్కువ మొత్తంలో ఉల్లిపాయల విస్తీర్ణం ఉంది. ఇక్కడి రైతులు ఉల్లిపాయలను బెంగలూరు మార్కెట్‌కు తీసుకెళ్ళి అమ్ముతారు. బుధవారం 'గ్రేడ్' ఉల్లిపాయలు క్వింటాలుకు రూ.800నుంచి గరిష్టంగా రూ. 1,400 వరకు అమ్ముడయ్యాయి. దీంతో కనీసం రవాణా ఖర్చులు కూడా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అప్పుల బాధ తప్పదని వాపోతున్నారు. ఉత్తంగి గ్రామానికి చెందిన రైతు ప్రదీప మణియప్ప మాట్లాడుతూ నాలుగున్నర ఎకరాల్లో ఉల్లిపాయలు పండించామని, ధర తగ్గినందున మేము ఒక్కటిన్నర ఎకరాలు మాత్రమే పండించి మార్కెట్‌కు పంపడానికి సిద్ధం చేశామన్నారు. కోత ,గ్రేడింగ్ చేయడానికి రూ. 45,000 ఖర్చయింది. ఎకరంలోఉల్లిపాయ పంటను నిర్వహించడానికి రూ.60, 70వేలు ఖర్చవుతుంది. క్వింటాలుకు కనీసం రూ.3,000 వస్తేనే కాస్త ఆదాయం వస్తుందని, ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లేకపోతే మంచి పంట వచ్చినా మేము అప్పులు చేయాల్సి ఉంటుందని ఉత్తంగి గ్రామానికి చెందిన రైతు ప్రదీప మణియప్ప అన్నారు. రాష్ట్ర ఉల్లిసాగుదారుల సంఘం అధ్యక్షుడు ఎన్.ఎం సిద్దేశ్ మాట్లాడుతూ తాలూకా స్థాయిలో ఉల్లికొనుగోలు కేంద్రాలను తెరవాలని, వాటిని రూ. 4000 మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. పంట సర్వేను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

గంధపు చెట్టు నరికివేత

- ఒకరి అరెస్ట్

బళ్లారి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):బళ్లారి జిల్లా సండూరు ఏరియాలో ఉండే స్వామిమలై అటవీ ప్రాంతంలో ఉన్న గంధపు చెట్లును నరికి అక్రమంగా తరలిస్తున్న దొంగల ముఠాలో ఒకరిని అటవీశాఖ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. స్వామిమలై అటవీప్రాంతంలో ఉండే గంధపు చెట్లును 10 నరికి చిన్నగా ముక్కలు చేసి గోనెసంచిలో వేసి రవాణాకు సిద్దంగా ఉంచారు. అక్కడ బీట్ వేస్తున్న అటవీశాఖ పోలీసులకు దొంగల ముఠా తారసుపడడంతో అనుమానం కలిగింది. వీరు అడవిలోకి వెళ్లి గమనించగా గంధపు చెట్లును నరినట్లు గుర్తించారు. వీరిలో సండూరు తాలూకా సుశీలానగర్ కు చెందిన మంజునాయక్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన వారు కొందరు తప్పించుకున్నట్లు అటవీశాఖ పోలీసులు తెలిపారు. నరికి గంధపు చెక్కలతో పాటు గొడ్డలి ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో చెయ్యి కోల్పోయిన బాలుడు

- అపార్ట్‌మెంట్ యజమాని, జెస్కాం అధికారిపై తండ్రి ఫిర్యాదు



చేయి కోల్పోయిన బాలుడు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురైన బాలుడు చేయి కోల్పోయాడు. నగరంలో ఆపార్ట్ మెంట్ విద్యుత్ కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన వైర్‌ను తాకడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటన అవ్వంబావి లోని విరాట్‌నగర్‌లో బుధవారం జరిగింది. ఈ ఘటనపై బాలుడు విశ్వబ్రాచారి తండ్రి శివాచారి నగరంలోని బ్రూస్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అపార్ట్‌మెంట్ యజమానులు సరితప్రియ ,జెస్కాం అధికారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విశ్వబ్రాచారి ఇంటి నేలపై అడుకుంటుండగా ఆ బాలుడు ప్రమాదవశాత్తు వైర్‌ను తాకాడు. దిని కారణంగా బాలుడు అక్కడిక్కడికే స్పృహకోల్పోయాడు. వెంటనే అతన్ని బిమ్స్ ఆసుపత్రికి చేర్చారు. చికిత్స సమయంలో బాలుడి చేయి తొలగించారు. ఫలితంగా బాలుడు శాశ్వత వైకల్యానికి గురయ్యాడు. అపార్టుమెంట్ యజమాని సరిత ప్రియ , జెస్కాం అధికారులపై చర్యలు తీసుకోవాలని శివాచారి డిమాండ్ చేశారు.

ఉప్పొంగిన వాగులు..వంకలు



కౌల్‌బజార్ అండర్ బ్రిడ్జి వద్ద వాహనదారుల అవస్థలు



కలెకరేట్ ఎదుట



సిటీ బస్టాండ్ సమీపంలో

కంప్లి/బళ్లారి రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : కంప్లి తాలుకాలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చుట్టుపక్కల వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కంప్లి తాలుకా పరిధి లోని శాంతినగర్ వద్ద నారళ్ల వాగు ఉగ్రరూపం దాల్చింది. అలాగే ఎమ్మిగనూరు వద్ద రామప్ప వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. కంప్లితో పాటు కురుగోడు, సిరిగేరి, కుడితిని పరిధి లోని గ్రామాల్లో రాత్రి కురిసిన భారీ వర్షానికి ఏ పొలాల్లో చూసినా నీరు నిలిచిపోయాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి, మొక్కజొన్న, మిరప ఇతర పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు, అధికారులు కోరారు. బళ్లారిరూరల్ తాలుకా లోని హగరి, రూపనగుడి, మోకా, బళ్లారి నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో బుధవారం రాత్రి వర్షం కురవడంతో నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. నగరంలో తాలుకా ఆఫీసు కలెక్టర్ కార్యాలయాల వద్ద నీరు నిలబడిపోయింది.

మహిళా రైతులు సాధికారత సాధించాలి: జడ్పీ డీఎస్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ అధికారి శశికాంత్ శివపురే

బళ్లారి సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ జీవనోపాది ప్రచారం కింద మహిళా రైతుల సాధికారత,స్థిరమైన వ్యవసాయ పద్దతులను బలోపేతం చేయడం ,గ్రామీణ జీవనోపాదిని మెరుగుపరచడంపై పాధాన్యం ఇస్తున్నట్లు జిల్లాపంచాయతీ డిప్యూటీ సెక్రటరీ శ శికాంత్ శివపురే అన్నారు. గురువారం బళ్లారి తాలూకా మోకా గ్రామంలోని పాండురంగా ఆలయ ప్రాంగణంలో జాతీయ గ్రామీణ జీవనోపాధి ప్రచారం ,సంజీవిని బెంగళూరు, జిల్లాపంచాయితీ, తాలూకా పంచాయితీ బళ్లారి, మోకా గ్రామయితీ నిర్వహించిన ముద్దమల్లేశ్వర సంజీవిని మహిళా కిసాన్ ఉత్పత్తి సంస్థ 2వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ముద్దు మల్లేశ్వర సంజీవిని మహిళా కిసాన్ ప్రొడ్యూసర్ కంపెనీలో 6గ్రామ పంచాయితీల నుండి మొత్తం 1000మంది మహిళలు వాటాదారులుగా ,10మంది డైరెక్టర్లుగా ఉన్నారు. ప్రతి వాటాదారుడు ఒక్కొక్కరూ 1500 పెట్టుబడి పెట్టారు. మొత్తం షేర్ క్యాపిటల్ రూ. 15లక్షలు,కంపెనీకి రూ. 15లక్షల వాటా క్యాపిట్ ఉంది. మోకా గ్రామపంచాయితీ అధ్యక్షురాలు పక్కీరమ్మ, జెడ్పీ సహాయ పరిపాలనాధికారి బసవరాజ్ హిరేమఠ్, బళ్లారి తాలూకా పంచాయితీ కార్యనిర్వహణాధికారి శ్రీధర్ బారికర్, మోకా ప్రభుత్వ ప్రథమ శ్రేణి కళాశాల ప్రిన్సిపాల్ సరోజ,మోకా రైతు కేంద్రం అధికారి జ్యోతి, జిల్లాప్రోగ్రాం విజయేంద్ర, రఘువర్మ, కాంతరాజు, గంగాధర్, బసవరాజ్, రాజేశ్వరీ, కంపెనీ డైరెక్ట్ బోర్డు సభ్యులు ఇతరులు పాల్గొన్నారు.



ముండ్రిగి లేఔట్‌లో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కమిషనర్ మంజునాథ

త్వరలో వెయ్యిమంది లబ్ధిదారులకు ఇళ్లు

- బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):నగరంలోని ముండ్రిగి సమీపంలో రాజీవ్ గాంధీటౌన్‌షిప్ ప్రాజెక్టు ద్వారా పూర్తి అయిన 1000 ఇళ్లను త్వరలో లబ్దిదారులకు అందిస్తామని బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే భరత్ నగర కమిషన్ మంజునాథ్ ఇతర అధికారులతో కలిసి ముండ్రిగి లేఔట్‌లోని నూతనంగా నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముండ్రిగి లేఔట్‌లో రాజీవ్ గాంధీ టౌన్‌షిప్ ద్వారా లబ్దిదారులు డబ్బులు కట్టడానికి ఇబ్బంది పడుతున్నారని ఈ విషయం దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.. ప్రభుత్వం వంద శాతం ఇళ్లను ఉచితంగా ఇవ్వాలనే ఆలోచనతో ఉందని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం, డీసీఎం , హౌసింగ్ మినిస్టర్ లతో ఈవిషయం చర్చిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే లబ్దిదారులకు ఇళ్లను అప్పగిస్తామని తెలిపారు.

డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి



అధికారి ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కర్ణాటక సౌహార్ద సభ్యులు

కంప్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : కంప్లి పట్టణంలో కొత్త బస్టాండు నుండి (సీపిరిదిన్నె) మారుతినగర్ వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని కర్ణాటక సౌహార్ద వేదిక జిల్లా అధ్యక్షులు షబ్బీర్ తెలిపారు. గురువారం కొత్త బస్టాండ్ వద్ద ప్రజల పనులు అసిస్టెంట్ ఇంజనీర్‌కు ఆనంద్‌కు మనవిపత్రం అందించారు. ఈ సందర్భంగా విలేఖరులతో వారు మాట్లాడుతూ గతంలో కొత్త బస్టాండ్ నుండి మారుతినగర్ మీదుగా ముద్దాపురం క్రాస్ వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సింగిల్ రోడ్డుకు భూమిపూజ చేశారన్నారు. రోడ్డు ఇరుకుగా వుండటంతో మారుతినగర్‌కు వెళ్లేవారు ఎన్నోసార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. కనుక అలాంటి సంఘటనలు జరుగకుండా ఈ రూ. 4 కోట్ల వ్యయంతో నైనా కొత్త బస్టాండ్ నుండి మారుతినగర్ వరకు డబుల్ రోడ్డు, డివైడర్ విద్యుత్ ఐమాక్స్ లైట్లు రోడ్డులో చిన్నపాటి బ్రిడ్జిలు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్నా, రంజిత్, రాఘవేంద్ర, యల్లప్ప, శివకుమార్, బసవరాజుగౌడ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ ఢీకొని ఇద్దరి దుర్మరణం

తోరణగల్లు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : డివైడర్ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. బుధవారం సండూరు తాలుకా వడ్డు గ్రామం నుంచి తోరణగల్లు వైపుగా సైకిల్ మోటార్‌పై వస్తున్న విక్రమ్ (19), రవితేజ (19), బసవన్న గౌడ్ మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను గుద్దుకోగా విక్రమ్, రవితేజ అక్కడికక్కడే మృతి చెందారు. బసవన్నగౌడ్‌కు గాయాల పాలు కావడంతో అతన్ని హాస్పిటల్‌కి తరలించారు. తోరణగల్లు నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని తనిఖీ చేస్తున్నట్టుగా చెప్పడం జరిగింది. దీనిపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి వుంది.

93 మందికి పట్టాల పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే గణేశ

కంప్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కంప్లి పురసభలోని 23 వార్డుల్లోను 5వ వార్డు ప్రధానమైన వార్డుగా నిలిచిందని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఇందిరా నగర్‌లోని 92 ఇళ్ల పట్టాదారులకు పురసభ నుండి ఫారం 3ను ఎమ్మెల్యే జేఎన్ గణేష్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ ఇందిరానగర్‌లో ఫారం3 కల నెరవేరిందన్నారు. పట్టా లేకుండా జీవిస్తున్న ప్రజలకు పట్టా పంపిణీ చేశామన్నారు. ఇందుకు కారకులైన వారు ఈ వార్డు కౌన్సిలర్ సుమ రాఘవేంద్ర అన్నారు. ప్రతిసారి ఈ వార్డులోని ప్రజల భవిష్యత్తు గురించి చర్చించేవారు తమతో అన్నారు. 92 మందికి పట్టాలతో పాటు ఫారం3 అందిస్తే ఎంతో మేలు చేసిన వారమవుతారన్నారు. సుమ రాఘవేంద్రకు రాబోయే పురసభ ఎన్నికల్లో కూడా తమ పార్టీ అభ్యర్థిగానే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షులు బట్ట ప్రసాద్ మాట్లాడుతూ ఆఫీసు వ్యవస్థ ద్వారా పురసభ నుండి లభించే సౌకర్యాలను వార్డులోని ప్రజలకు అందిస్తున్నామన్నారు. అవసరమైన పత్రాలు సమర్పిస్తే అర్హత కలిగిన సౌకర్యాలను పొందవచ్చన్నారు. పురసభ సభ్యులు సుమ రాఘవేంద్ర, సీఆర్ హనుమంతు, ముఖ్య అధికారి బి మల్లికార్జున, స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఉస్మాన్, ఏపీఎంసీ చైర్మన్ హబీబుర్ రెహమాన్, ప్రముఖులు శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, షేక్షావలి, మస్తాన్ వలీ పాల్గొన్నారు.

లింగసుగూరు పురసభ అధికారుల పై సస్పెన్షన్ వేటు

రాయచూరు సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణల మేరకు జిల్లాలోని లింగసుగూరు పురసభలో పని చేస్తున్న ముగ్గురు అధికారులను జిల్లాధికారి కే నితీశ్ గురువారం సస్పెన్షన్ వేటు విధించారు. లింగసుగూరులోని హులిగడ్డ ప్రాంతంలో గల సర్వే నెంబరు 10/1/1, 10/2/1, 10/1/13 209-32లోని ఒక లేఔట్‌లో పబ్లిక్ అవసరాల కోసం ఉద్దేశించిన స్థలాన్ని నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి దాన్ని ప్లాట్‌లుగా విభజించి అమ్మేందుకు సహకరించారన్న ఆరోపణ మేరకు పురసభ ముఖ్య అధికారి రవి సిరగుప్పి, రెవెన్యూ అధికారి అశోక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖయాజ్‌ల పై సస్పెన్షన్ వేటు విధించారు. అవినీతికి పాల్పడితే ఏశాఖలో అధికారిపైన అయినా చర్యలు తప్పవని ఈ సందర్భంగా జిల్లాధికారి హెచ్చరించారు.

హోసూరు జోన్

ముఖ్యమంత్రికి ఘనస్వాగతం



సీఎంకు పుస్తకం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్


హోసూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): హోసూరులో ఏర్పాటైన పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే ప్రకాశ్ ఘనంగా స్వాగతం పలికారు. చెన్నై నుంచి విమానంలో పెలకొండపల్లిలోని తనేజా ఏరోస్పేస్‌కు గురువారం చేరుకున్నారు. పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి ఎం చక్రపాణి, పరిశ్రమల మంత్రి డీఆర్‌పీ రాజా, బరగూరు ఎమ్మెల్యే మతియజగన్, తళి ఎమ్మెల్యే డీ రామచంద్రన్‌లు స్వాగతం పలికారు. ఎంపీ గోపినాథ్, మేయర్ సత్య, డిప్యూటి మేయర్ ఆనందయ్యలు విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి ఒక పుస్తకాన్ని బహూకరించారు. దారి పొడవునా పార్టీల నాయకులు, అభిమానులు స్వాగతం పలికారు.

కెలవరపల్లి డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో



డ్యాంనుంచి దిగువకు వస్తున్న నీరు

హోసూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని కెలవరపల్లి డ్యాంకు ఇన్‌ఫ్లో పెరిగింది. గురువారం 1058 క్యూసెక్కులకు చేరుకుంది. బుధవారం 900 క్యూసెక్కులు ఉండగా ఎగువన వర్షాలు పెరగడంతో డ్యాంకు నీరు భారీగా చేరుతోంది. డ్యాంకు ఇన్‌ఫ్లో పెరగడంతో అదే మేరకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం నీటిమట్టం 41.33 అడుగులుగా ఉందని అధికారులు తెలిపారు.



ధర తగ్గిన టమోటా

హోసూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): హోసూరు మార్కెట్‌కు ఇతర ప్రాంతాలనుంచి టమోటా అధికంగా వస్తోంది. కొన్నివారాలుగా కిలో టమోటా రూ.40గా ఉండేది. సరిహద్దు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లనుంచి కూడా టమోటా వస్తుండడం ఆమేరకు డిమాండ్ లేకపోవడంతో ధర తగ్గింది. ఐదారురోజులగా కిలో 15-18 మధ్యన ధర పలుకుతోంది. టమోటాధర క్రమేపీ తగ్గుతుండడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరకంటే మరింత తగ్గకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ సంతోష్ చవాన్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బళ్లారి పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ రకాల మోసాలు అధికంగా జరగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సంతోష్ చవాన్ అన్నారు. గురువారం జరిగిన సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు పౌరసమాజంలో పెరుగుతున్నాయని, ఇది క్యాన్సర్ లాంటిదన్నారు. బళ్లారి జిల్లాలో సైబర్ మోసాల కారణంగా జరిగిన నష్టం రూ. 70కోట్లకు పైగా ఉందన్నారు. మోసపోయినవారిలో చాలామంది తమ ప్రతిష్ట దెబ్బతింటుందనే భయంతో ఫిర్యాదు చేయడం లేదన్నారు. నగరాల్లో 100ప్రధాన నగరాలు, పట్టణాల్లో మేమే వరుస ఇంటరాక్టివ్ కార్యక్రమాలు ,డిజిటల్ అవగాహన ప్రచారాలు నిర్వహిస్తున్నామన్నారు.

న్యాయం చేయాలని మహిళల ఫిర్యాదు



మహిళలతో మాట్లాడుతున్న న్యాయాధికారి కవిత

హోస్పేట,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోట్లాది రూపాయల మోసపోయిన మహిళలకు న్యాయం చేయాలని కోరుతూజిల్లా న్యాయాధికారి కవితాఎస్ మణికేరికిజన్వాడి మహిళా సంఘం వినతి పత్రం అందజేశారు. గురువారం వారు మాట్లాడుతూ కోట్ల విలువైన డబ్బును రెట్టింపు చేయాలనే కలను సృష్టించిన ప్రియాంక్ జైన్ బృందంలో డబ్బు జమ చేసి పూర్తిగా మోసపోయా మన్నారు. తమను న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా సభ్యుడు వినోద్, మరిడిజంబయ్యనాయక్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా కవితా ఈశ్వర్ సింగ్



హోస్పేట,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):దక్షిణ కన్నడ జిల్లా, మైసూర్ జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కవితా ఈశ్వర్ సింగ్ నియమితులయ్యారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గౌరి గణేష్ పండుగ సందర్భంగా అన్ని జిల్లాల మహిళా కాంగ్రెస్ కార్యదర్శులను తన ఇంటికి ఆహ్వానించారు.వారికి బహుమతులుగా శ్వేదం జరిగింది. విజయనగరకు గొప్ప గౌరవం అని కవితా సింగ్ తెలిపారు, ఈ పదవికి తనను ఎంపిక చేసినందుకు మంత్రి జమీర్‌ఆహ్మద్ ఖాన్, విజయనగర నియోజకవర్గం ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు సొసైటీ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

- అధ్యక్షుడు ఖాసీంబాబు

కంప్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ భాగాల్లో వుండే ప్రాథమిక కృషిపత్తిన సహకార సంఘాలను ప్రతి ఒక్కరు సదుపాయాలను సద్వినియోగపరచుకోవాలని సొసైటీ అధ్యక్షులు బి ఖాసీంబాబు తెలిపారు. గురువారం కంప్లి తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసిన వార్షిక మహాజన సభ కార్యక్రమంలో పాల్గొని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25కు సుమారు రూ. 2678435 నిరక లాభంతో సహకార సంఘం ముందుకెళుతుందని అధ్యక్షులు బి ఖాసీం బాబు అన్నారు. ఖాతాదారులే సహకార సంఘానికి దేవుళ్లన్నారు. వినియోగదారులు సంఘంతో వ్యవహరించడం ద్వారా మంచి వ్యాపార సంబంధాలను పెంచుకోవాలన్నారు. ఈ సంఘం రైతుల ప్రయోజనాల కోసం పనిచేస్తోంది. సంఘం చీఫ్ ఎగ్జిక్యూటివ్ జడేశరెడ్డి ఆడిట్ నివేదికను చదివి వినిపించారు. సంఘంలో 3894 మంది సభ్యులు, రూ. 124.45 లక్షల వాటా మూలధనం వుందని చెప్పారు. ఇది రూ. 220.01 లక్షల డిపాజిట్లను సేకరించింది. ఇది రూ. 52.22 లక్షల వ్యాపారం చేసింది. రూ. 14.96 లక్షలు ట్రేడింగ్ లాభాన్ని కలిగి వుంది. సంఘం సుమారు రూ. 2678435లు వివిధ రంగాల్లో రాణించిన ప్రతిభ విద్యార్థులకు అభినందించి సన్మానించి నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా బీడీసీసీ జిల్లా డైరెక్టర్ మూకయ్య స్వామి, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు శారద, అసోసియేషన్ ఉపాధ్యక్షులు సిద్దమ్మనహళ్లి అల్లాసాబ్, డైరెక్టర్లు మహేష్ గౌడ, పక్కీరప్ప, కే శేఖరప్ప, అమరేష్, జీరు ఉమాపతి, నెల్లూడి రాజాసాబ్, దేవరమనె రంజాన్‌సాబ్, కే రాము, తిప్పమ్మ, సదాశివప్ప, వీరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న సొసైటీ సభ్యులు